

ఎర్రవల్లిలో మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి హాజరైన పార్టీ జడ్పీ చైర్‌పర్సన్లు, ఇతర నాయకులు

నేను తెచ్చిన తెలంగాణనూ చెరిపేస్తరా?

మొదటిపేజీ తరువాయి...

బీఆర్ఎస్ ప్రభుత్వంలో జడ్పీ చైర్మన్లు అందరూ రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, విజయవంతంగా పదవీ కాలాన్ని పూర్తి చేసినందుకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాజీవితంలోకి వచ్చిన తర్వాత అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజల కోసం పని చేసేటోళ్లే నిజమైన రాజకీయ నాయకులని పేర్కొన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నీ సవ్యంగా నడిచాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు, తాగునీటి ఇబ్బందులతో పాటు శాంతి భద్రతల సమస్య తలెత్తి మతకల్లోలాలు చెలరేగడం బాధ కలిగిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. అప్పుడున్న అధికారులే ఇప్పుడూ ఉన్నారని, మరి శాంతిభద్రతల సమస్య ఎందుకు వస్తున్నదో ఆలోచించాలని కోరారు. గతంలో ఏ ప్రభుత్వాలూ చేయని అభివృద్ధిని పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందని పేర్కొన్నారు. పార్టీ నాయకులను సృష్టిస్తుంది కానీ నాయకులు పార్టీని సృష్టించరని, మంచి యువనాయకత్వాన్ని తయారు చేస్తామని చెప్పారు. అత్యున్నత పదవులు అనుభవించి పార్టీని వీడుతున్న వారిని ప్రజలు కూడా అసహ్యించుకుంటున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక గతంలో వైఎస్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను పేర్లు మార్చకుండా ఇంకా బాగా అమలు చేశామని గుర్తు చేశారు.

> ప్రజాజీవితంలోకి వచ్చాక అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల కోసం పనిచేసేటోళ్లే నిజమైన రాజకీయ నాయకులు.
> -కేసీఆర్

> కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతల సమస్యలు తలెత్తాయి. మతకల్లోలాలు చెలరేగాయి. అప్పుడున్న అధికారులే ఇప్పుడూ ఉన్నారు. మరి సమస్య ఎక్కడ వస్తున్నది.
> -కేసీఆర్

రెండేండ్లలో నియోజకవర్గాల పునర్విభజన

తెలంగాణ వచ్చే నాటికి చెట్టుకొకడు పుట్టకొకడు అయ్యిండనే బాధతో వ్యవసాయాన్ని స్థిరీకరణ చెయ్యాలని రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి రైతులందరికీ అందించామని కేసీఆర్ వివరించారు. రకరకాల కారణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడా పథకానికి ఎగనామం పెట్టాలని చూస్తున్నదని ఆరోపించారు. రైతులు ఏడాది పొడవునా పంటలను సాగు చేస్తూనే ఉంటారని పేర్కొన్న కేసీఆర్.. సాగు లెక్కలు ఇతరత్రా కారణాలు చూపుతూ రైతుబంధును అమలు చేస్తే అవినీతి మొదలవుతుందని హెచ్చరించారు. మరో రెండేండ్లలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని, అదే జరిగితే రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య 160 వరకు పెరిగే అవకాశం ఉందని వివరించారు. అప్పుడు మహిళలకు కూడా ఎక్కువ అవకాశాలు వస్తాయని చెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణం ఇంకా జరగాల్సి ఉన్నదని, ఈసారి బీఆర్ఎస్ తరపున ఎవరికి బీఫాం దక్కితే వాళ్లదే విజయమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కొంచెం కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. పార్టీ అన్ని స్థాయిల్లోని కమిటీల ఏర్పాటు ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సోషల్ మీడియాను కూడా పటిష్టంగా తయారు చేస్తామని చెప్పారు. బంగ్లాదేశ్‌లో హమ్మీ అనే ప్రొఫెసర్ పేద మహిళల కోసం 71 వేల పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి వారిని ఆదుకున్న విధానం గురించి , జీరో పొల్యూషన్, నగరాల్లో అక్కడి మేయర్లు ప్రజల్లో మమేకమైన విధానం గురించి కేసీఆర్ వారికి వివరించారు.

> తెలంగాణ పునర్నిర్మాణం ఇంకా జరగాల్సి ఉన్నది. ఈసారి బీఆర్ఎస్ తరపున ఎవరికి బీఫాం దక్కితే వాళ్లదే విజయం. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కొంచెం కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయి.
> -కేసీఆర్

జడ్పీ చైర్మన్లను సన్మానించిన కేసీఆర్

రాష్ట్రంలోని బీఆర్ఎస్ జడ్పీ చైర్మన్లను పార్టీ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన నివాసంలో శాలువా కప్పి సన్మానించారు. కుటుంబ సభ్యులతో కలిసి సమావేశానికి హాజరైన జడ్పీ చైర్మన్లు కేసీఆర్‌తో ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారిని పేరుపేరునా పలకరించారు. ఆయా జిల్లాల్లో జరిగిన అభివృద్ధిలో భాగం పంచుకున్నందుకు అభినందించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్ ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశం అనంతరం జడ్పీ చైర్మన్లు అందరికీ యాదాద్రి ప్రసాదంతో పాటు జ్ఞాపికలను కేటీఆర్ అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి కేసీఆర్ కలవడం సంతోషంగా ఉందని జడ్పీ చైర్మన్లు ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాల్క సుమన్, గండ్ర వెంకటరమణారెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పార్టీ సీనియర్ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీ చైర్మన్లు జనార్దన్ రాథోడ్ (ఆదిలాబాద్), కోరిపెల్లి విజయలక్ష్మి (నిర్మల్), దాదన్నగారి విఠల్‌రావు (నిజామాబాద్), దఫేదార్ శోభ (కామారెడ్డి), దావ వసంతసురేశ్ (జగిత్యాల), పుట్టా మధుకర్ (పెద్దపల్లి), కనుమళ్ల విజయ (కరీంనగర్), న్యాలకొండ అరుణ (రాజన్న సిరిసిల్ల), పటోళ్ల మంజుశ్రీ (సంగారెడ్డి), ర్యాకల హేమలత, వేలేటి రోజారాణి (సిద్దిపేట), శాంతాకుమారి (నాగర్‌కర్నూల్), బండా నరేందర్‌రెడ్డి (నల్లగొండ), గుజ్జ దీపిక (సూర్యాపేట), ఎలిమినేటి సందీప్ రెడ్డి (యాదాద్రి భువనగిరి), ఆంగోత్ బిందు (మహబూబాబాద్) , గండ్ర జ్యోతి (వరంగల్), మారేపల్లి సుధీర్‌కుమార్ (హన్మకొండ), జక్కు శ్రీహర్షిణి (జయశంకర్ భూపాలపల్లి), బడే నాగజ్యోతి (ములుగు), లింగాల కమల్‌రాజ్ (ఖమ్మం) తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి జాతీయ పార్టీల తూట్లు!

- ఒక పార్టీ గుర్తుపై గెలిచిన అభ్యర్థులను చేర్చుకుంటున్న ఆ రెండు పార్టీలు
- నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం
- విశ్వగురు భారత్.. దేశ గురు తెలంగాణ
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ సభ్యులు రాజ్యాంగ ప్రతిపై ప్రమాణం చేసి రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవరిస్తున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి ఆక్షేపించారు. రాజ్యాంగాన్ని కాపాడుతామని, దేశ ప్రజలకు సేవ చేస్తామని చెప్తూనే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన పెద్దలు ఒక పార్టీ గుర్తుపై గెలిచిన అభ్యర్థులను తమ పార్టీలో చేర్చుకుంటున్నారని విమర్శించారు. మహారాష్ట్ర. మణిపూర్, గోవా, ఉత్తరప్రదేశ్‌తో పాటు తాజాగా తెలంగాణలో ఇలాగే చేర్చుకున్నారని ఆక్షేపించారు. ఇలాంటి రాజ్యాంగ ఉల్లంఘనలపై పార్లమెంట్ కఠినంగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం ఆయన రాజ్యసభలో ప్రసంగిస్తూ.. రాష్ట్రపతి ప్రసంగంలో కొత్త దనం ఏమీ లేదని, కొత్త ఆశలు లేవు, ఆశయాలు కూడా ఏమీ కనిపించలేవని పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో ఫెడరల్ స్ఫూర్తి లోపించిందని, రాష్ట్రాల సహకారంతో దేశాన్ని నడిపామని ఎక్కడా చెప్పలేదని ఆక్షేపించారు. గత ప్రసంగంలో కూడా రైతుల ఆదాయం డబుల్ చేస్తామని చెప్పారని కానీ, డబుల్ కాలేదని తెలిపారు. దేశంలో ఈసారి సంకీర్ణ ప్రభుత్వం, సంకీర్ణ ప్రతిపక్షం ఏర్పడిందని చెప్పారు. తాము రెండు కూటములకు దూరంగా ఉంటామని, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రభుత్వానికి సూచనలు చేస్తామని, ప్రజలకు అన్యాయం జరిగితే మాత్రం ఊరుకొనే ప్రసక్తే ఉండదని స్పష్టంచేశారు. వెనుకబడిన తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులపై చట్టసభల్లో పోరాడుతామని చెప్పారు.

ప్రాంతీయ పార్టీల గొంతునులిమేయత్నం

ప్రజల ప్రయోజనాలు, సెంటిమెంట్, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రాంతీయ పార్టీలు ఏర్పడతాయని సురేశ్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం ప్రాంతీయ పార్టీల గొంతు నులిమే ప్రయత్నం జరుగుతున్నదని అన్నారు. రాజ్యంగాన్ని కాపాడుతాం అంటూనే.. రాజ్యాంఘాన్ని ఉల్లంఘిస్తున్నారని, తెలంగాణ వాయిస్‌ను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం నుంచి ఆశించిన సహకారం రావడం లేదని పేర్కొన్నారు.

జనరేటర్‌తో జడ్పీ సమావేశం

మేడ్చల్, జూలై2(నమస్తే తెలంగాణ): అందరు అనుకున్నట్టే అయ్యింది.. ఎందుకైనా మంచిదని జనరేటర్‌ను ముందే తెప్పించడం మంచిదైంది.. చివరికి ఆ జనరేటరే అక్కరకొచ్చింది.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో మంగళవారం జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జడ్పీ ఛైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన కాసేపట్లో సమావేశం ప్రారంభం అవుతుందనుకున్న సమయంలో కరెంట్ పోయింది. జనరేటర్‌ను ఆన్ చేసి సమావేశాన్ని ప్రారంభించారు. కాసేపటికి కరెంట్ రావడంతో జనరేటర్‌ను ఆఫ్ చేశారు. మళ్లీ కరెంట్ పోయింది. ఇక లాభం లేదని జనరేటర్‌తోనే సమావేశాన్ని నడిపించారు.

గత ప్రభుత్వ సమాచారాన్ని తీసేస్తరా?

- అదంతా ప్రజల ఆస్తి.. కాపాడాల్సిన బాధ్యత సీఎస్‌దే
- వెబ్‌సైట్లు, సోషల్‌మీడియా ఖాతాల తొలగింపుపై కేటీఆర్ ఆగ్రహం
- పునరుద్ధరించాలని సీఎస్‌కు లేఖ

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ వెబ్‌సైట్లు, సోషల్‌మీడియా హ్యాండిల్స్ గత ప్రభుత్వాలు నిక్షిప్తం చేసిన డిజిటల్ సమాచారం మొత్తం ప్రజల ఆస్తి అని, దానిని ఉద్దేశపూర్వకంగా తొలగించడం హేయమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వానికి సంబంధించిన డిజిటల్ సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి మంగళవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లు, మీడియా హ్యాండిల్స్‌లో ముఖ్యమైన కంటెంట్, సమాచారం కనబడకుండా పోతున్నదని, కొన్ని ముఖ్యమైన వెబ్‌సైట్లను కూడా తీసేశారని సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. మొదట్లో మెయింటెనెన్స్ సమస్య అని చెప్పే ప్రయత్నం చేశారని, కొన్ని నెలలుగా మరింత సమాచారం కనబడకుండా పోతుండటంతో ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నారనే అనుమానాలొస్తున్నాయని పేర్కొన్నారు. దీని వెనుక రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల హస్తం ఉన్నదనే సందేహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన కీలకమైన, అత్యంత ప్రాధాన్యమైన సమాచారాన్ని భవిష్యత్ తరాలకు తెలియకుండా చేసేందుకు చేస్తున్న హేయమైన చర్యను ఆపాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వాలకు సంబంధించిన మొత్తం డిజిటల్ కంటెంట్‌ను భద్రపర్చాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర, ప్రాముఖ్యం భవిష్యత్ తరాలకు తెలియకుండా చేసే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని సీఎస్‌ను కోరారు. రాష్ట్ర చరిత్ర, ప్రాముఖ్యతకు సంబంధించిన అన్ని ఆధారాలు, సమాచారం, డిజిటల్ కంటెంట్‌ను కాపాడాల్సిన బాధ్యత సీఎస్‌పై ఉన్నదని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలోనే సీఎస్‌కు లేఖ రాయాల్సి వస్తున్నదని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న (జూన్ 2014-డిసెంబర్ 2023) సమయంలోని వేలాది ఫొటోలు, వీడియోలతోపాటు ఎంతో విలువైన సమాచారాన్ని తొలగించారని వివరించారు.

భవిష్యత్తు తరాలు క్షమించవు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగించిన వైబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ వివరాలను లేఖలో కేటీఆర్ జత చేశారు. పబ్లిక్‌డొమైన్ నుంచి తొలగించిన కంటెంట్‌ను వెంటనే పునరుద్ధరించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ చరిత్ర, ప్రాముఖ్యం భవిష్యత్ తరాలకు తెలియజేసే విధంగా సమగ్రమైన సమాచారాన్ని గత ప్రభుత్వం రూపొందించిందని పేర్కొన్నారు.

తొలగించిన వెబ్‌సైట్ల వివరాలివీ...

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి జనవరి నుంచి తొలగించిన వైబ్ సైట్లు, పోర్టల్స్ వివరాలను లేఖవెంట అందజేశారు. వాటి వివరాలిలా ఉన్నాయి.

- తెలంగాణ రాష్ట్ర పోర్టల్ (https://www.telangana.gov.in/):
- రాష్ట్ర చరిత్ర - URL: https://www. telangana.gov.in/about/history/
- తెలంగాణ రిపోర్ట్స్ పేజీ - URL:https://www.telangana.gov.in/reports/ ఈ వెబ్‌సైట్‌లో 2014-2023 మధ్య తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన అన్ని ముఖ్యమైన రిపోర్టులతోపాటు హోస్ట్ చేసిన వివరాలు ఇందులో ఉన్నాయి. విద్యార్థులు, పరిశోధకులు, పెట్టుబడిదారులకు ఇది ఎంతో విలువైన సమాచారం.
- తెలంగాణ సీఎం వెబ్‌సైట్: (https://cm.telangana.gov.in/) 2014 జూన్ 2 నుంచి 2023 డిసెంబర్ 3 వరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్ నుంచి తీసేశారు. భద్రపరచాల్సి ఉన్న సమాచారాన్ని తొలగించారు.
- తెలంగాణ CMO సోషల్ మీడియా హ్యాండిల్స్: (YouTube, Facebook, Twitter & Instagram) : 2014 జూన్ 2 నుంచి 2023 డిసెంబర్ 3 వరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదవీకాలానికి సంబంధించిన వేలాది ఫొటోలు, వీడియోలు, ముఖ్యమైన సమాచారం సంబంధిత సోషల్ మీడియా హ్యాండిల్స్ నుంచి తీసేశారు.

కరువుకు శాశ్వత పరిష్కారం కాళేశ్వరం!

- ఎండిన శాపానికి విమోచనం కాళేశ్వరం
- ఎక్స్ వేదికగా కేటీఆర్ కవితాత్మక వర్ణన

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ప్రజల కరువులకు, కన్నీళ్లకు శాశ్వత పరిష్కారం కాళేశ్వరం ప్రాజెక్టు అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పేర్కొన్నారు. తెలంగాణ తెర్లయిపోతే సంకలు గుద్దుకుందామని చూసిన వంకరబుద్ధిగాళ్లకు ఈర్ష్య, అసూయ పుట్టించి, కన్ను కుట్టించిన తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం అని అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఘనతను వర్ణిస్తూ మంగళవారం కేటీఆర్ ఎక్స్‌లో కవితను పోస్టు చేశారు. 'తలాపున గోదారి గలగల పారుతున్నా తనువంతా ఎడారై ఎండి నశాపానికి విమోచనం కాళేశ్వరం' అంటూ కాళేశ్వరం ఘనతను కేటీఆర్ కవితాత్మకంగా తెలియజేశారు. 'సముద్రమట్టానికి ఎత్తున ఉన్న తెలంగాణ చేను చెలకలు నదీ జలాలతో తడవాలంటే ఎత్తిపోతలే శరణ్యం' అని కుండబద్దలు కొట్టారు. 'దగాపడ్డ నేల దశాబ్దాలుగా జరిపిన గోదారి జలాల సాధన పోరాటాలకు సమాధానం కాళేశ్వరం' అని అభివర్ణించారు. 'శిథిల శివాలయంగా పాడుబడిపోయిన శ్రీరామ్‌సాగర్‌కు పునరుజ్జీవమిచ్చిన పుణ్యవరం కాళేశ్వరం' అని కేటీఆర్ కీర్తించారు.

భావోద్వేగానికి గురైన జడ్పీ చైర్‌పర్సన్ విజయను ఓదారుస్తున్న మంత్రి ప్రభాకర్

దళిత జడ్పీటీసీకి ఘోర అవమానం

మొదటిపేజీ తరువాయి...

అడ్డుకున్నారు. ఈ టీ షర్ట్ విడిచి వేరే చొక్కా వేసుకుని వస్తేనే లోనికి అనుమతిస్తామని గట్టిగా చెప్పారు. ఈ విషయాన్ని శ్యామ్ అక్కడికి వచ్చిన మీడియా ప్రతినిధులకు తెలిపారు. పోలీసులు మరోసారి జోక్యం చేసుకుని ఇక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలని ఆదేశించారు. అయినా శ్యామ్ అక్కడే ఉన్నారు. దీంతో పోలీసులు బలవంతంగా జడ్పీ ప్రధాన గేటు వెలుపలి వరకు పంపించి ఈ షర్ట్ వేసుకుని మరోసారి ఇటు రావద్దని హెచ్చరించారు. దీనిపై జడ్పీ సర్వసభ్య సమావేశంలో పెద్ద దుమారం రేగింది. తాము నక్సలైట్లమా? టెర్రరిస్టులమా? అంటూ నిలదీశారు. వెంటనే జోక్యం చేసుకున్న జడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ.. జడ్పీటీసీ శ్యామ్‌ను సమావేశానికి రానివ్వాలని పోలీసులను కోరారు. అయినా వినకుండా.. తమకు జడ్పీ సీఈవో చెప్పాలని ఓ పోలీసు అధికారి స్పష్టం చేశారు. అధ్యక్షురాలు సీఈవోకు విజ్ఞప్తి చేయగా.. ఆయన మౌనంగా ఉండిపోవడంతో కాసేపు గొడవ జరిగింది. ఈ సందర్భంగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది ఒక్క జడ్పీటీసీ సభ్యుడికి జరిగిన అవమానం కాదని, జడ్పీ అధ్యక్షురాలికి, సభకు జరిగిన అవమానమని వ్యాఖ్యానించారు. అంతకుముందు విద్యాశాఖపై జరిగిన చర్చలో పాల్గొన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డీఈవో జనార్దన్‌రావును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. భోజన విరామం తర్వాత రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలను సత్కరించారు. ఈ సందర్భంగా తన ఐదేండ్ల పాలనను గుర్తు చేసుకున్న జడ్పీ అధ్యక్షురాలు విజయ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు.

రైతు భరోసా మార్పులపై సబ్ కమిటీ

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా(రైతుబంధు)లో మార్పులు, నూతన విధివిధానాల రూపకల్పనపై ప్రభుత్వం మంత్రులతో సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు సభ్యులుగా ఉన్నారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

బీఆర్ఎస్ కార్యాలయానికి బల్దియా నోటీసులు

మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశాలు

వరంగల్, జూలై 2: బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయానికి గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. బాలసముద్రంలోని సర్వే నంబర్ 1066లో బీఆర్ఎస్ కార్యాలయం కోసం ఎకరం భూమి కేటాయింపు, భవన నిర్మాణం అక్రమమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరపాలని హనుమకొండ ఆర్డీవో, తహసీల్దార్‌తోపాటు గ్రేటర్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు కాజీపేట సర్కిల్-2 డిప్యూటీ కమిషనర్ రవీందర్ బీఆర్ఎస్ కార్యాలయానికి నోటీసులు జారీ చేశారు. సర్వే నంబర్ 1066లో ఎకరం భూమి కేటాయింపు డాక్యుమెంట్లతోపాటు భవన నిర్మాణ అనుమతుల ప్రొసీడింగ్ కాపీలను మూడు రోజుల్లో సమర్పించాలని పేర్కొన్నారు.

సర్కారు ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి...

యువత, మేధావివర్గంలో తీవ్రంగా చర్చ జరుగుతున్న అంశాలివీ. వాస్తవానికి నిరుద్యోగులు కోరుతున్నవన్నీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలేనని విశ్లేషకులు చెప్తున్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'అన్నీ' చేస్తామంటూ అడ్డగోలు హామీలు ఇచ్చారని, ఇప్పుడు వాటిని మరిచిపోయి నిరుద్యోగులను పూచిక పుల్లల్లా తీసి పడేస్తున్నారని విమర్శిస్తున్నారు. నిరుద్యోగుల డిమాండ్లలో సగానికిపైగా మానవీయ కోణంలో తీసుకోవాల్సిన నిర్ణయాలేనని, అయినా ప్రభుత్వం ఎందుకు ఇంత కఠినంగా ప్రవర్తిస్తున్నదో అర్థం కావడం లేదని అంటున్నారు.

ఎందుకు సాధ్యం కాదు?

నిరుద్యోగులు ప్రభుత్వానికి ప్రధానంగా 10 డిమాండ్లు చేస్తున్నారు. వాటిని ఒకసారి విశ్లేషిస్తే.. పరిష్కరించటం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదన్నది నిపుణుల మాట. ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటే గ్రూప్-1 మెయిన్‌కు అభ్యర్థులను 1:100 నిష్పత్తి ప్రకారం పిలవడం సాధ్యమేనని చెప్తున్నారు. జీవోలో మార్పులు చేసి టీజీపీఎస్సీకి సమాచారం ఇస్తే, గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌కు మార్పులు చేస్తారని చెప్తున్నారు. గ్రూప్-2 పోస్టులను 2 వేలకు, గ్రూప్-3 పోస్టుల సంఖ్య 3 వేలకు పెంచాలన్నది నిరుద్యోగుల మరో ప్రధాన డిమాండ్. ఇది అసాధ్యం అనే స్థాయిలో ప్రభుత్వం స్పందిస్తున్నది. వాస్తవానికి గ్రూప్స్ ఉద్యోగాలు పెంచాలన్నది ప్రతిపక్షంలో ఉండగా కాంగ్రెస్ చేసిన డిమాండే. ఇప్పుడు గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను పెంచటం కూడా ప్రభుత్వం చేతుల్లోనే ఉన్నదని నిపుణులు అంటున్నారు. వివిధ శాఖల నుంచి ఇండెంట్ తీసుకొని, ఆర్థిక శాఖకు పంపితే, అనుమతులు వచ్చిన తర్వాత ప్రభుత్వం అనుమతితో.. టీజీపీఎస్సీకి పంపితే అనుబంధ నోటిఫికేషన్ వేసే వీలుంటుందని సూచిస్తున్నారు. ఇదే ప్రభుత్వం గతంలో గ్రూప్-1 పోస్టులను 503 నుంచి 60 పోస్టులు అదనంగా కలిపి 563 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన సంగతిని గుర్తు చేస్తున్నారు. డీఎస్సీలో పోస్టుల సంఖ్యను 5 వేల నుంచి 11 వేలకు పెంచారని చెప్తున్నారు. గ్రూప్-1 పోస్టులు, డీఎస్సీ పోస్టులు పెంచటం సాధ్యమైనప్పుడు గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచటం ఎందుకు సాధ్యం కాదు? అన్నది నిపుణులు, నిరుద్యోగుల నుంచి ఎదురవుతున్న ప్రశ్న. జీవో 46ను రద్దు చేయటం, గురుకుల పోస్టుల్లో రిలింగ్విస్‌మెంట్‌ను అమలు చేయటం, జాబ్ క్యాలెండర్ ప్రకటించటం, నిరుద్యోగ భృతి 4 వేలు ఇవ్వడం వంటివన్నీ ప్రభుత్వం చేతిలోనే ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. డీఎస్సీ పరీక్షలు ఈ నెల 18న మొదలై ఆగస్టు 5వరకు కొనసాగనున్నాయి. ఆ తర్వాత రెండు రోజులకే.. అంటే ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు జరగనున్నాయి. డీఎస్సీ రాశాక గ్రూప్-2కు సిద్ధం కావడానికి కనీసం రెండు నెలల గ్యాప్ ఉండాలన్నది నిరుద్యోగుల అభ్యర్థన. అక్టోబర్‌లో గ్రూప్-1 మెయిన్స్, నవంబర్‌లో గ్రూప్-3 పరీక్షలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. గ్రూప్-2ను కనీసం డిసెంబర్ వరకు వాయిదా వేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

పోలీసుల సాయంతో ఉక్కుపాదం

ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు అండగా ఉంటామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నదంటూ నిరుద్యోగులు మండిపడుతున్నారు. యూనివర్సిటీలు, సిటీ సెంట్రల్ లైబ్రరీ, ఇందిరాపార్క్.. ఇలా నిరుద్యోగులు ఎక్కడ నిరసన తెలిపినా ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేస్తున్నదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రోన్ కేసు విచారణపై స్టే

కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారన్న అభియోగంతో నమోదైన కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావుకు ఊరట లభించింది. ప్రజాప్రతినిధుల కోర్టులో ఆ కేసు విచారణను నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద డ్రోన్ కెమెరాలను వినియోగించి ఇంటర్వ్యూ నిర్వహించడంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు నిరుడు ఈ కేసు నమోదు చేశారు. దీన్ని కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన పిట